క్లుప్తంగా

ఏపీ కాపు ప్రచార కమిటీ చైర్మన్‌గా బాల ఈశ్వరయ్య

గిద్దలూరు రూరల్: రాష్ట్ర కాపు అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏపీ కాపు ప్రచార కమిటీ చైర్మన్‌గా గిద్దలూరుకు చెందిన దుత్త బాల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నిలిచిన విద్యుత్ సరఫరాతో అవస్థలు

బేస్తవారిపేట: బేస్తవారిపేట పంచాయతీ కార్యాలయం వెనుక ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి 9 గంటల నుంచి శుక్రవారం రాత్రి వరకు విద్యుత్ లేకపోవడంతో మండే వేసవిలో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రెడ్డినగర్, జెడ్పీ బాలుర హైస్కూల్ వీధి, తహసీల్దార్ కార్యాలయం వీధి, ఎంపీడీఓ కార్యాలయం వీధుల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు వివరించగా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

వైభవంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో అమావాస్య శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద అమావాస్యను పురస్కరించుకుని బాలాత్రిపుర సుందరీదేవికి కుంకుమార్చనలు, అభిషేకాలు, చిన్నమస్తాదేవికి గుమ్మడికాయలు, నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు అర్చకుడు ప్రసాద శర్మ నిర్వహించారు. స్వామి వారికి అభిషేకంలు, అర్చనలు, నవగ్రహ పూజలు అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి భక్తులతో జరిపించారు. భక్తులకు ఆశీర్వచనం అందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు శనివారం రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో పర్యటిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాజుపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు.

26 నుంచి క్రికెట్ టోర్నమెంట్

కొమరోలు: మండలంలోని తాటిచెర్లలో ఈ నెల 26వ తేదీ నుంచి గిద్దలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమ్మర్ స్పెషల్ ప్రో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని, టోర్నమెంట్‌లో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదు, తృతీయ బహుమతి రూ.5 వేల నగదు అందిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 95500 22421, 87906 53479 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు వేణుగోపాలుడికి అభిషేకం

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లిలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి 16 రోజుల పండగ సందర్భంగా శనివారం ఉదయం అభిషేకం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యరావు తెలిపారు. సాయంత్రం మహిళలతో విష్ణు సహస్ర నామ పారాయణం, రాత్రి 7 గంటలకు స్వామివారి ఊరేగింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

భువనేశ్వరికి జగనన్న ఆణిముత్యం అవార్డు


భువనేశ్వరి

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని చీతిరాల భువనేశ్వరి జగనన్న ఆణిముత్యం నియోజకవర్గ స్థాయి అవార్డుకు ఎంపికైంది. పదో తరగతిలో 571 మార్కులు సాధించిన ఆమెకు అవార్డు రావడంపై పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ ఈవీ రంగయ్య హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన రమాదేవి

పొదిలి రూరల్: బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన పొదిలి మండలంలోని అగ్రహారం సమీపంలో కర్నూలు–ఒంగోలు రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. అగ్రహారం గ్రామానికి చెందిన రావులపల్లి రమాదేవి పొలంలో మేకలు తోలి ఇంటికి తిరిగి వస్తోంది. అదే సమయంలో పొదిలి నుంచి మర్రిచెట్లపాలేనికి వీరాంజనేయులు అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ అగ్రహారం సమీపంలో రమాదేవిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను పొదిలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సుందరయ్య జీవితం యువతకు ఆదర్శం


దర్శిలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: సుందరయ్య జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం జిల్లా నాయకుడు వి.బాలకోటయ్య అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూస్వామి కుటుంబంలో పుట్టి పేదలు, బడుగు బలహీనవర్గాల కోసం అహర్నిశలూ శ్రమించిన గొప్పవ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సుందరయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.ఆవులయ్య, మూర్తి, నరసింహులు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలను కొనియాడారు. కుందుర్తి అనిల్, కోలా కిరణ్, బండారు శ్రీకాంత్, కొండా ఫ్రాన్సిస్, సుధాకర్, పుష్పాంజలి, మహేశ్వరి పాల్గొన్నారు.

దర్శి: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఉప్పు నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ 13 ఏళ్ల వయసులోనే గాంధీజీ పిలుపు మేరకు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని చెప్పారు. సీపీఎం నాయకులు ఉప్పుటూరి నాగరాజు, అంజిబాబు, ఈమని నాగేశ్వరరావు, రామకోటిరెడ్డి, కాలేబాషా, ఆదినారాయణ, రంగనాయకులు, కావ్య, రవితేజ, రాహుల్, సాయి, రాజు పాల్గొన్నారు.

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి

మార్కాపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకు అలుపెరుగని పోరాటాలు చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డీకేఎం రఫీ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనేక దశాబ్దాలపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన తన కోట్ల రూపాయల ఆస్తిని పేద ప్రజలకు పంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆయన త్యాగాలు మరువలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య అన్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సుదర్శన్, సీపీఎం నాయకులు రమేష్, రవి, రూబెన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్మికులకు అల్పాహారం అందించారు.

వైఎస్సార్ సీపీలోకి వార్డు సభ్యుడు


వెంకటేశ్వరరెడ్డిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పొదిలి మండలం అన్నవరం పంచాయతీ చింతగుంపల్లికి చెందిన టీడీపీ వార్డు సభ్యుడు కాకునూరి వెంకటేశ్వరరెడ్డి వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతున్న సమయంలో మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో చేరారు. వెంకటేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మోరా శంకర్‌రెడ్డి, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొండ్రుగుంట సుబ్బారావు, గూడూరి వినోద్, ముల్లా జాకీర్, అంబవరపు నారాయణరెడ్డి, పేరం కోదండరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి ఎమ్మెల్యే ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: మండలంలోని భూపనిపల్లి గ్రామంలో వడదెబ్బతో మృతి చెందిన మాజీ ఎంపీపీ నూనె వీరారెడ్డి(75)కి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపీపీగా ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బద్దిగం నారాయణరెడ్డి, మార్కాపురం ఎంపీపీ అరుణాచెంచిరెడ్డి, త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, జేఎస్ఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మల్లయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

వడగాల్పులతో జాగ్రత్తగా ఉండాలి


వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం విజయ

పొదిలి: అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ దానియేల్ జోషెఫ్ సూచించారు. శుక్రవారం స్థానిక పాత పంచాయతీ కార్యాలయంలో ఎన్ఎన్ఎం విజయ మాట్లాడుతూ.. వడదెబ్బకు గురైన వారికి చెమట పట్టదని, వణుకు రావడంతోపాటు పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బకు గురికాకుండా తరచూ మంచినీరు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ తాగాలని సూచించారు. ఇబ్బందికర పరిస్థితి ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, కార్మికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


అంకన్న (ఫైల్)

యర్రగొండపాలెం: అప్పుల బాధ తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం వేకువ జామున మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గోళ్లవిడిపిలో జరిగింది. వివరాలు.. బొమ్మనబోయిన అంకన్న (45) అప్పుల పాలై అవి తీర్చే మార్గం కనిపించక ఈ నెల 7వ తేదీన తన పొలంలో పురుగుమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు యర్రగొండపాలెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అతడి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అంకన్న మృతి చెందాడు. తహసీల్దార్ కె.దాస్, ఎస్‌ఐ జి.కోటయ్యలు మృతదేహాన్ని పరిశీలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

ఉపాధి హామీ లక్ష్యాలను అధిగమించాలి

● ఎంపీడీఓ నరసింహులు


ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏపీఓ

తర్లుపాడు: ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీఓ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటలలోపు పనులు ముగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల వద్ద నీడ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కూలీల బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మీర్జాపేట, గొల్లపల్లి, మంగళకుంట, జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఏపీఓ నాగరాజు పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డు ఉన్నవారికి వంద రోజులు తగ్గకుండా పని కల్పించాలని చెప్పారు. ఈసీ పెద్దన్న, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సమాచార వారధులు పాత్రికేయులు


మాట్లాడుతున్న ఓపీ మల్లిక్

మార్కాపురం టౌన్: పాత్రికేయులు సమాచార వారధులని యజ్ఞోపవీతం పత్రిక ఎడిటర్ ఓపీ మల్లిక్ అన్నారు. నారదమహర్షి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయ దినోత్సవం నిర్వహించారు. నైతిక విలువలతో పాత్రికేయుల జీవితం ముడిపడి ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార విభాగ ప్రముఖ్ కె.విశ్వేశ్వరరావు, జిల్లా ప్రముఖ్ ఎస్ సూర్యనారాయణబాబు, సీనియర్ పాత్రికేయులు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, కేవీ సత్యనారాయణ, కె.రామకృష్ణ, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ.. అంకాలమ్మ కొలుపులు


పూజలందుకుంటున్న పోలేరమ్మ

దర్శి: పట్టణంలో పోలేరమ్మ..అంకాలమ్మ కొలుపులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. అమ్మవారిని ఆభరణాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు సాల పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదన చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

అమావాస్య అన్నప్రసాదం పంపిణీ


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

యర్రగొండపాలెం: స్థానిక అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బస్టాండ్ ఆవరణలో అమావాస్య అన్నప్రసాద వినియోగ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి అమావాస్య రోజు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమితి సభ్యులు యక్కలి భాగ్యారావు, సూరె వెంకటస్వామి, గ్రంధిశిల సూర్యం, కె.హనుమంతరావు, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, బీవీ సుబ్బారెడ్డి, పి.రామచంద్రరావు, జి.కృష్ణ పాల్గొన్నారు.

కొత్తరకం సైబర్ నేరాలతో మోసపోవద్దు

దర్శి: కొత్త రకాల సైబర్ నేరాలతో మోసపోవద్దని డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో కొత్తరకం సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా మండలంలోని కొర్లమడుగులో ఇటీవల చీదర్ల రామకృష్ణ అనే 32 ఏళ్ల వ్యక్తి వడదెబ్బ కారణంగా మరణించాడని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి తాను డీఎస్పీనని చెప్పి.. వీఆర్వో ద్వారా చనిపోయిన ఫ్యామిలీ మెంబర్ల ఫోన్ నంబర్లు తీసుకున్నారు. వారికి ఫోన్ చేసి సన్‌స్ట్రోక్‌తో చనిపోయిన వారికి ఐదు లక్షల రూపాయలు వస్తాయని చెప్పి నమ్మబలికారు. వెంటనే తమ నంబర్‌కు రూ.14630 ప్రాసెసింగ్ ఫీజు ఫోన్ పే చేసిన వెంటనే అకౌంట్‌లో డబ్బులు వేస్తామని మోసం చేశారన్నారు. పోలీస్ అధికారులు, ఏ ఇతర అధికారులు మీకు ఫోన్ చేసి ఈ విధంగా డబ్బులు వేస్తే మీ అకౌంట్‌లో డబ్బులు పడతాయని చెప్పరన్నారు. ఇలాంటి మోసాలపై దర్శి డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి ఫోన్‌లు వచ్చిన వెంటనే దర్శి డీఎస్పీ: 91211 02160, దర్శి సీఐ: 91211 02161, దర్శి ఎస్‌ఐ: 91211 02161 నంబర్లకు, మీ సమీప పోలీసుస్టేషన్‌లకు తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పర్చూరు (చినగంజాం): ద్విచక్రవాహనాన్ని ట్రాలీ వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన పర్చూరు వ్యవసాయ మార్కెట్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన వల్లూరి రవి పర్చూరు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనం జాగర్లమూడి వైపు తిరిగే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవి ఎడమ చేతికి గాయమై ఫ్రాక్చర్ అయింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చొని ఉన్న అతని భార్య మరియమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని హుటాహుటిన పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చీరాల వైద్యశాలకు తరలించారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీస్

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామ కార్యదర్శికి ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాగంబొట్లపాలెం కార్యదర్శి పురం నరేంద్ర విధులు, రికార్డుల నమోదు సక్రమంగా లేక పోవడంపై ఆయన వివరణ అడిగారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పుల్లలచెరువు: పుల్లలచెరువు పోలీసుస్టేషన్‌ను మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల వివరాలు పరిశీలించారు. త్వరలో రాబోతున్న ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ, ఎస్‌ఐ శ్రీహరి పనితీరుపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉమ్మడివరంలో పోక్సో కేసు విచారణ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎస్‌ఐ శ్రీహరి ఉన్నారు.

అదనపు కట్నం కోసం మహిళపై దాడి

మార్టూరు: ఓ వివాహిత కుటుంబంపై అదనపు కట్నం కోసం ఆమె భర్త, బంధువులు దాడి చేసిన ఘటనపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వలపర్లకు చెందిన తన్నీరు భవానికి అదే గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మీ ప్రసాద్‌తో మూడేళ్ల క్రితం వివాహం కాగా వీరికి ఇద్దరు సంతానం. గత కొంత కాలంగా భవానీని అదనపు కట్నం తీసుకురావలంటూ భర్త లక్ష్మీప్రసాద్ అతని కుటుంబ సభ్యులు శారీరకంగా మానసికంగా వేధించసాగారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అదనపుకట్నం విషయమై వివాదం ప్రారంభమై లక్ష్మీ ప్రసాద్ అతని తరపు బంధువులు భవానీ కుటుంబ సభ్యులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిలో భవానీకి అతని సోదరుడు పవన్‌కుమార్‌లు గాయపడగా మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భవాని ఫిర్యాదుపై పోలీసులు ఆమె భర్త లక్ష్మీప్రసాద్, అత్త,మామలు తన్నీరు అంజమ్మ, లక్ష్మయ్య ఇతర కుటుంబ సభ్యులు అంకమ్మరావు, రేణుక, అంజలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

300 మందికి కంటి పరీక్షలు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 300 మంది హాజరై పరీక్షించుకున్నారు. వీరిలో 250 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పరిశీలకుల నియామకం

తాళ్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభల పరిశీలకులుగా అధికారులను శుక్రవారం నియమిస్తూ డ్వామా పీడీ శీనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్న గ్రామసభలకు వ్యవసాయాధికారి ప్రసాదరావు, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


జగనన్న కాలనీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

పెద్దారవీడు: ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.శీనారెడ్డి అన్నారు. మండలంలో తోకపల్లె సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు జగనన్న కాలనీని సందర్శించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టని లబ్ధిదారుల ఇంటి స్థలం పట్టాలను రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం ఉద్యోగులు సమయ పాలన కచ్చితంగా పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. సర్పంచ్ జిల్లెల మల్లేశ్వరి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రావ్య, ఏపీఓ సాంబశివయ్య పాల్గొన్నారు.

గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

కొనకనమిట్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని మండల పరిషత్ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం గొట్లగట్టులో జగనన్న కాలనీ లేఔట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో 50 శాతం గృహాలు ప్రారంభిస్తే ప్రభుత్వం నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరగతిన పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేయాలన్నారు. గృహల నిర్మాణాకి అనువుగా లేని స్థలాలకు బదులుగా పక్కనే మరో 12 మందికి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీత వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ దిలీప్ కుమార్, కార్యదర్శి ప్రసాద్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

శివరామపురం కార్యదర్శిగా ప్రసన్నకుమార్

తాళ్లూరు: మండలంలోని శివరామపురం ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా తాళ్లూరు కార్యదర్శి ఎన్‌యూ ప్రసన్నకుమార్‌ను నియమిస్తూ ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా నియమించిన పురం నరేంద్ర పూర్తి బాధ్యతలు గ్రామ కార్యదర్శి ప్రసన్నకుమార్‌కు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో ఎంపీడీఓ పేర్కొన్నారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

తర్లుపాడు: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పొందేందుకు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ చంద్రశేఖర్ సూచించారు. జనుములు, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు కావాల్సిన వారు తమ వాటాగా సగం ధర చెల్లించాలని తెలిపారు. పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, అధిక దిగుబడి పొందవచ్చన్నారు.

నూతన యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

ముండ్లమూరు: సంఘాల్లోని మహిళల సమాచారాన్ని నూతనంగా రూపొందించిన లోకోస్ యాప్‌లో పొందు పరిచేందుకు మహిళలు అవగాహన పెంచుకోవాలని ఏపీఎం హనుమంతరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో శుక్రవారం మూడో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాల్సి ఉందన్నారు. పొరపాటు చేస్తే సరిచేసుకునేందుకు రాష్ట్ర స్థాయిలో అవకాశం లేదన్నారు. గ్రామ స్థాయి, మండల స్థాయి, జాతీయ స్థాయిలో మాత్రమే సరి చేసేందుకు అవకాశం ఉందన్నారు. వీఓఏలు సమన్వయంతో పని చేసి సంఘాల గ్రేడింగ్‌ను పెంచాలన్నారు.